డ్రెయిన్ల ఆక్రమణ.. ముంపులో పంటలు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- కనీస మరమ్మతులకు సైతం నోచుకోని కాల్వలు
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు



బంటుమిల్లి వద్ద ఆక్రమణలో మైనర్ డ్రెయిన్

బంటుమిల్లి: మండల పరిధిలోని మైనర్, మీడియం డ్రెయిన్లు ఆక్రమణలకు గురి కావడంతో వర్షాకాలంలో పంటలు ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. మండలంలో దాదాపు దాదాపు 50 కిలోమీటర్లు మేర మైనర్, 30 కిలోమీటర్లు మేరకు మీడియం, 15 కిలో మీటర్లు వరకు మేజర్ డ్రెయిన్లు ప్రవహిస్తున్నాయి. వరి, ఆక్వా పంటలకు సంబంధించి సాగునీరు పంట కాలువలు, మురుగు డ్రెయిన్లపైనే ఆధారపడి ఉంది. ఈ క్రమంలో మైనర్ డ్రెయిన్లు అత్యధికంగా ఆక్రమణలో ఉండటంతో పంట పొలాల్లో మురుగు నీరు కిందకు వెళ్లక రోజుల తరబడి పంటలు నీటిలోనే నానే దుస్థితి నెలకొంది. నాగేశ్వరరావుపేట, పెందుర్రు, చోరంపూడి, బంటుమిల్లి డ్రెయిన్లు మొదటి నుంచి చివరి వరకు రైతుల ఆక్రమణలో ఉన్నందున ఎగువ అధిక వర్షాలకు మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచి రైతులు పంట నష్టపోవడానికి కారణమవుతుంది. ఈ డ్రెయిన్లు ఆక్రమణకు తోడు పూడిక తీయకపోవడం, వలకట్లు అడ్డం వెరసి నీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంటుంది. డ్రెయిన్ల మరమ్మతుల పేరుతో ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నీటి లెక్కలుగానే మిగులుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారులు కుమ్మక్కై మరమ్మతులు తూతూ మంత్రంగా చేసి బిల్లులు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువగా విన్పిస్తున్నాయి.

మండలంలో పరిస్థితి ఇదీ....

మండలంలో పెదతుమ్మిడి మీడియం, నాగేశ్వరరావుపేట, బంటుమిల్లి, పెందురు మైనర్ డ్రెయిన్లు ఎక్కడిక్కడే సంవత్సరాల తరబడిగా ఆక్రమణలో ఉన్నాయి. పాలకుల ఉదాసీనవైఖరి, అధికారులు కాలయాపన ఎగువ రైతులకు శాపంగా మారుతున్నది. పెదతుమ్మిడి మీడియం డ్రెయిన్‌పై బంటుమిల్లి, ముదినేపల్లి, పెడన మండలాల పరిధిలోని వేలాది ఎకరాల సాగు, చెరువు భూములు ఆధారపడి ఉన్నాయి. ఈ డ్రెయిన్ బంటుమిల్లి మండలం, నాగన్నచెరువు పంచాయతీ శివారు యడ్లలంక వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది. అలాగే పెందుర్రు మీడియం డ్రెయిన్ మల్లంపూడి వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది. ఈ డ్రెయిన్‌లో బంటుమిల్లి, నాగేశ్వరరావుపేట, బందకోడు మైనర్ డ్రెయిన్లు కలుస్తాయి. ఈ డ్రెయిన్లపై బంటుమిల్లి మెయిన్ కాలువ వద్ద నుంచి వేలాది ఎకరాల సాగు భూములు, చెరువులు ఆధారపడి ఉన్నాయి. ఈ డ్రెయిన్ల ఆక్రమణకు తోడు తూడు, గుర్రపుడెక్క, కిక్కిస పొదలతో పూడికతో నిండిపోయి వర్షాకాలంలో నీటిపారుదల లేక పంట పొలాల్లో నీరు బయటకు రాక రోజుల తరబడి పంట పొలాల్లోనే నీరు నిలిచిపోయే దుస్థితి నెలకొంది. పెదతుమ్మిడి, పెందుర్రు మీడియం డ్రెయిన్లు జీరో పాయింట్ నుంచి ఆక్రమణలు తొలగించి మైనర్ డ్రెయిన్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తే రైతుల పంట ఇళ్లకు చేరే అవకాశం ఉంది. సంవత్సరాలైన మైనర్ డ్రెయిన్లు తవ్వకం పనులు ప్రభుత్వాలు చేయడం లేదని ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్ పరిధిలోని రైతులు గత ఏడాది చందాలు వేసుకుని దాదాపు రూ. 6 లక్షలతో తవ్వకం వారే చేసుకుని పంటలు నష్టపోకుండా కాపాడుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్పందించి మైనర్, మీడియం డ్రెయిన్లు వర్షాకాలం రాకముందే తవ్వకం పనులు చేసి ఆరుగాలం కష్టించిన పంట ముంపు బారిన పడకుండా క్షేమంగా ఇళ్లకు చేరేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై బంటుమిల్లి, పెడన సెక్షన్ ఏఈఈలు కుమార్, నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలోని డ్రెయిన్‌లన్నింటికీ మరమ్మతుల కోసం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపామన్నారు. అనుమతులు వస్తే టెండర్లు పిలిచి పనులు వెంటనే చేయిస్తామన్నారు.



బంటుమిల్లి-నాగేశ్వరరావుపేట గ్రామాల మధ్య పంట పొలాల్లో నిలిచిన మురుగునీరు (ఫైల్)

వేసవిలోనే మరమ్మతులు చేయాలి



వర్షాకాలం రాకముందే ప్రభుత్వం వెంటనే స్పందించి డ్రెయిన్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలి. పంటలు చేతికొచ్చే ముందు ముంపుబారిన పడి వేలాది రూపాయలు నష్టపోతున్నారు. ప్రభుత్వ సాయం పూర్తి నష్టాన్ని పూడ్చదు. రైతులకు అప్పుల తప్పడంలేదు. కనుక వెంటనే వేసవిలోనే ప్రభుత్వం డ్రెయిన్లకు మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలి.

– తిరుమాని శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం, జిల్లా కన్వీనరు.

ఎన్ని అర్జీలు ఇచ్చిన చర్యలు శూన్యం



నియోజకవర్గ పరిధిలో మైనర్, మీడియం డ్రెయిన్ల మరమ్మతులకు ఎన్నోసార్లు అధికారులకు స్పందనలో అర్జీలు ఇచ్చాము. తాత్కాలిక పనులతో సరిపుచ్చుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చేయడంలేదు. డ్రెయిన్లు పూర్తి స్థాయిలో నీటి పారుదల ఉంటే పంట నష్టాలు ప్రభుత్వాలు ఇవాల్సిన అవసరంలేదు. గతంలో పంటలు నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందలేదు. ఆక్రమణలు తొలగించి డ్రెయిన్లు పూర్తి స్థాయిలో తవ్వకం, పూడిక తీస్తే రైతులు నష్టాల నుంచి బయటపడతారు.

– గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం, పెడన డివిజన్ కార్యదర్శి

క్లుప్తంగా

పులిగడ్డ సర్పంచ్‌కి గౌరవ డాక్టరేట్



చల్లపల్లి: మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ దాసరి విజయకుమార్ ఆదివారం డాక్టరేట్ అందుకున్నారు. తమిళనాడులోని హోసూరులో ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చరల్ ఆకాడమీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కరోనా, వరదల సమయంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకుగానూ సోషల్ సర్వీస్ విభాగంలో విజయకుమార్‌కు గౌరవ డాక్టరేట్ అందించారు. విజయకుమార్‌ను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతోపాటు పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



కృత్తివెన్ను: పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు అక్కడక్కడా చిరుజల్లులు కురువడంతో ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత అధికంగా ఉండి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మూగజీవాలు సైతం ఎండవేడిమి తాళలేక చిన్నపాటి నీడదొరికినా సేదతీరుతున్నాయి. తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో ఎండలు ప్రభావానికి ఉదయం 9 గంటలకే ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



చల్లపల్లి: స్థానిక శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో ఆదివారం, అమావాస్య, అశ్విని నక్షత్రం సందర్భంగా స్వామివారిని కలికాల రూరూ భైరవుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భానూ సంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



చల్లపల్లి: మండల పరిధిలోని మాజేరు పంచాయతీ శివారు పచ్చావారిలంకలో విద్యుత్ వైర్లు కిందికి వాలిపోయి ప్రమాదకరంగా మారాయి. చేతికి అందే ఎత్తులో ఉండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు భయాందోళనలకు గురవుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకునేందుకు నిత్యం రైతులు ఈ మార్గంలోనే వెళుతుంటారు. గత కొంత కాలంగా ఇదే విధంగా వైర్లు వేళాడుతున్నా... ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వైర్లు పైఎత్తులో సక్రమంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

కోడూరు: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వై.పుష్పలత ఆదివారం తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ అంశాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పుస్తకపఠనం, కథలు చెప్పించడం, డ్రాయింగ్, చెస్, క్యారమ్‌తో పాటు పలు ఇండోర్ గేమ్స్‌ను విద్యార్థులతో నేర్పించనున్నట్లు పుష్పలత చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు గ్రంథాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



చల్లపల్లి ప్రధాన సెంటర్లో ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న అఖిల పక్ష నేతలు

చల్లపల్లి: భారతదేశం నుంచి ఉగ్రవాదాన్ని, మతోన్మాదాన్ని, కులోన్మాదాన్ని పారదోలాలనని పలువురు అఖిల పక్ష నేతలు తెలిపారు. ఇటీవల పెహల్గామ్‌లో జరిగిన దాడికి నరసనగా అఖిల పక్ష నేతలు ఆదివారం సాయంత్రం ప్రధాన సెంటర్లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రదాడిలో చనిపోయిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, అఖిల పక్ష నాయకులు అడ్డాడ ప్రసాద్, మీర్ రిజ్వాన్, నసీమ్ ఘోరి, హనుమానుల సురేంద్రనాద్‌బెనర్జీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, సిద్దాబత్తుల వాసు, బోలెం నాగమణి, వెనిగళ్ళ వసంతరావు, వాకా రామచంద్రరావు, నర్సా చిన్ని, తుటారాం ప్రసాద్, రావి రాజేశ్వరరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, ఉప్పల సాంబశివరావు, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరు సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

క్రైస్తవుల కొవ్వొత్తుల ర్యాలీ

మచిలీపట్నంటౌన్: కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన తీవ్రవాదుల మారణకాండను నిరశిస్తూ మచిలీపట్నం, పెడన దైవ సేవకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కోనేరుసెంటర్‌కు క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చి కొవ్వొత్తులను చేతపట్టుకొని తీవ్రవాదం నశించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బెరాకా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ కిరణ్‌పాల్ మాట్లాడుతూ తీవ్రవాదాన్ని సమూలంగా రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలను కొనియాడారు. తీవ్రవాదాన్ని నిర్మూలించే చర్యలకు క్రైస్తవుల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. కాశ్మీరీలోని పహల్గామ్‌లో జరిగిన మారణకాండ మానవ సమాజాన్నే కుదిపేసిందన్నారు. ఇలాంటి ఘటనలను ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. పాస్టర్లు మేకా విజయరాజు, నాగిశెట్టి డేనియల్, జీవియర్, బట్టు శ్యామ్, మేకా డానియేల్, డేనియల్ ఎబ్నేజర్, తాతా జక్రయ్య, కె డేవిడ్, వంశీ, కె చిన్నారావు, సీపీఐ నాయకుడు లింగం ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

బావిపై ప్రహరీ నిర్మాణం

పట్టించుకోని సాంఘిక సంక్షేమ అధికారులు

కోడూరు: ఇటీవల బాపట్ల జిల్లాలో ఓ కాంట్రాక్టర్ ఇంటి ముందు ఉన్న కారును పక్కకు తీయకుండా సీసీ రోడ్డును నిర్మించిన సంగతి అందరికి తెలిసిందే. ఇదే తరహాలో ప్రస్తుతం కోడూరు మండలంలో మరో కాంట్రాక్టర్ బాలిక వసతి గృహం చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడను ఓ బావిపై నిర్మిస్తున్నాడు. మండలంలోని స్వతంత్రపురం ఎస్సీ బాలికల వసతి గృహం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 లక్షల నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పూర్తి నాణ్యతా లోపంగా పనులు నిర్వహిస్తున్నారు. ప్రహరీ నిర్మించే ప్రాంతంలో మరుగుదొడ్లకు సంబంధించిన సెప్టిక్‌ట్యాంక్ బావి అడ్డు రాగా, దానిని తొలగించకుండా పనులు కొనసాగిస్తున్నాడు. సెప్టిక్‌ట్యాంక్ బావి పైభాగం నుంచే ప్రహరీ పనులు కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం గోడ నిర్మాణానికి కింద భాగంలో సిమెంట్ బీమ్ వేస్తుండగా, ఆ బీమ్‌ను బావిపై నుంచి నిర్మించారు. ప్రహరీ బరువుకు బావి లోపలకు కుంగిపోయి గోడ కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. గోడ నిర్మాణంలో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా సాంఘిక సంక్షేమ అధికారులు ఆ వైపు కన్నెత్తైనా చూడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



బావిపై నుంచి సాగుతున్న ప్రహరీ నిర్మాణం

యండకుదురులో తాగునీటి సమస్య పరిష్కరించాలి

సీపీఎం నేతల డిమాండ్



సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణరావు

ఘంటసాల: మండలంలోని యండకుదురు పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఘంటసాలలో సీపీఎం కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులు శీలం నారాయణరావు, మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావులు ఆదివారం మీడియాతో మాట్లాడారు. యండకుదురు గ్రామంలో వాటర్ ట్యాంకు కూలడానికి సిద్ధంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజల పట్ల ఈ ప్రభుత్వం ఎంత ఉదాసీనంగా ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ట్యాంకు తొలగించి మరొకటి నిర్మించి యండకుదురు, జీలగలగండి కాలనీ వాసుల తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరందించాలని తెలిపారు.

దావోజిపాలెంలో బుసక నిల్వలు



దావోజిపాలెం వద్ద బుసక దంపు

పెడన: ఆ గట్టు...ఈ గట్టు లేదు.. ఎక్కడ గట్టు కనిపించినా, పంట పొలాల మెరక పేరుతో బుసకను తరలించి ఒక చోట డంపు చేస్తున్నారు. ఆ విధంగా డంపు చేసిన బుసకను వేలాది రూపాయాలకు విక్రయిస్తున్నారు. మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామ శివారులో శేరివత్తర్లపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే బుసకను డంపు చేసి ఉంచారు. అనధికారికంగా ఈ డంపు నిల్వలను అధికారులెవ్వరూ కూడా పట్టించుకోవడం లేదు. అధికార పార్టీకి చెందిన తమ్ముడివే కావడంతో అటుగా కన్నెత్తి చూసే ధైర్యం చేయడం లేదు. ఈ డంపు నిల్వలు కాస్తా ఎప్పుడైనా ఏ అర్ధరాత్రి సమయంలో ఒకేసారి ఎత్తుకు పోయినా అంటే తరలించేసినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి అనధికార డంపులను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

వ్యాను ఢీకొని గేదె మృతి

కోడూరు: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై వి.కొత్తపాలెం సమీపంలో రొయ్యల వ్యాను ఢీకొని ఓ గేదె మృతి చెందింది. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో కోడూరు నుంచి అవనిగడ్డ వైపుకు రొయ్యలు లోడు వేసుకొని వెళ్తున్న వ్యాన్ గేదెను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి వేళ గేదె కనిపించకపోవడంతో పాటు నూతన రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

వైద్యుడు జగదీష్‌కు పేర్ని దంపతుల పరామర్శ



మచిలీపట్నంటౌన్: నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు చక్క జగదీష్‌ను మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), జయసుధ దంపతులు ఆదివారం పరామర్శించారు. జగదీష్ తండ్రి నాగేశ్వరరావు ఈ నెల 14వ తేదీన మృతి చెందారు. ఈ నేపథ్యంలో పేర్నినాని దంపతులు జగదీష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. నాగేశ్వరరావు మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. జగదీష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని ఈ సందర్భంగా పేర్ని దంపతులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుమారికి నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 50వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పి.కుమారి శనివారం మృతి చెందగా ఆదివారం ఆమె అంతిమయాత్ర నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కుమారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుమారి అంతిమయాత్రలో పాల్గొని ఆమె పాడెను మోశారు.

నేడు కోఆర్డినేషన్ సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జె.స్వర్ణభారతి తెలిపారు. మండల స్థాయి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రాజకీయ కక్ష సాధింపుతోనే అక్రమ కేసులు

గూడూరు: రాజకీయంగా కక్ష సాధింపు సాధించడానికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్‌గా గెలిచిన తనతో పాటు పార్టీ నాయకుడు కారుమంచి కామేశ్వరరావులపై అక్రమ కేసులు బనాయించారని ఆకుమర్రు సర్పంచ్ బొల్లా కృష్ణ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివార్లలోని బాపన కోనేరు చెరువులో ప్రమాదవశాత్తూ ఐదేళ్ల బాలుడు కమ్మగంటి నవనీత్ పడి చనిపోవడం బాధాకరమన్నారు. ఆటలాడుకునే వయస్సులో చెరువులోకి దిగిన నవనీత్ ఊపిరి అందక చనిపోవడం అందరినీ కలచివేసిందన్నారు. బాలుడి మృతిని కూటమి నేతలు శవరాజకీయాలకు వాడుకోవడం బాధాకరమన్నారు. పంచాయతీ తీర్మానం, గ్రామ సభ ఆమోదం పొంది ప్రభుత్వ అనుమతులతో రెండేళ్ల క్రితం చెరువు గట్టు పటిష్టం చేయడం జరిగిందన్నారు. పూర్తిగా అధికారుల పర్యవేక్షణలో గట్లను పటిష్టం చేస్తే కూటమి నాయకులు చెరువు తాటిచెట్టంత లోతు తవ్వేశారని దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు. కూటమి నాయకుల శవరాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. తమపై బురద జల్లి, రాజకీయంగా కక్ష తీర్చుకోవడానికి కూటమి నాయకులు బనాయిస్తున్న అక్రమ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని ఆమె స్పష్టం చేశారు.

నేటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

మచిలీపట్నంటౌన్: విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లోనూ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ నెల 28వ తేదీ సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకూ ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల్లో పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యంగా కథలు వినడం, పుస్తకాలు చదవటం, పుస్తక సమీక్ష, కథలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకే వంటి అంశాలపై శిక్షణ, పోటీలు నిర్వహించనున్నారు. పోటీలలో విజేతలకు బహుమతులను ఇస్తారు.

ఘనంగా కృష్ణాపురం పాఠశాల వార్షికోత్సవం



స్కిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోడూరు: మండలంలోని కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఉద్దండి యానాదిరావు పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సినిమా పాటలు, జానపద నృత్యాలకు అనుగుణంగా డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, వి.శ్రీనివాసరావుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. గ్రామప్రముఖులు ముద్దినేని చంద్రరరావు, ఇంకొల్లు మురళీకృష్ణ, గంగాప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన గంగానమ్మ జాతర



ఆలయంలోని గంగానమ్మ

ఉండ్రపూడి(పామర్రు): రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్న గంగానమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. తొలుత ఆలయంలోని అమ్మవారిని 108 జల బిందెలతో జలాభిషేకం చేశారు. అమ్మవారిని పసుపు కుంకుమలతో అలంకరించి నూతన వస్త్రాలను ధరింప చేశారు. తదుపరి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పొలిమేరలో ఉన్న కట్టుని తొలగించారు. అక్కడి నుంచి అమ్మవారిని పోతురాజు గడలను గ్రామంలో మేళ తాళాలతో కనకతప్పెట్లతో వైభవంగా ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి ఇంటింటి వద్ద నీటిని వారగా పోసి నీరాజన హారతులు ఇచ్చి చద్ది నివేదనలను సమర్పించారు. ఊరేగింపు తదుపరి అమ్మవారికి ఆలయంలో ప్రవేశ పెట్టారు. గ్రామస్తులు అమ్మవారికి నివేదనలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ తోట పోలాక్షి రాంబాబు మేకా గోవర్ధనరావు, తోట రాంబాబు, దాసు ఏడుకొండలు, మట్టా శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు, మట్టా నాగమల్లేశ్వరరావు, చీర్ల ఆంజనేయులు, మండపాక దినేష్, రవితేజ పాల్గొన్నారు.